
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 108 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృధు చరిత్ర - 1

క్రితం వ్యాసంలో వేనుడి గురించి చూసాం. ఆయన అహంకారం ఎక్కువై నోటికొచ్చినట్టూ మాట్లాడే సరికి సింహాసనం మీదనుంచి దించారు. రాజు పోయాడు కనక అరాజకం జరిగితీరుతుంది. వీడి దరిద్రం వదిలింది, ముందు జరిగేది జరుగుతుంది అని రాజుని దింపినవారు వాళ్ల తోవన వెళ్ళారు.

సీ. మునివరేణ్యులు భక్తి దనర సరస్వతీ
సలిలంబులను గృతస్నాను లగుచు
మునుకొని తత్తీరమున నగ్నిహోత్రముల్-
విలసిల్ల నియతిఁ గావించి యచటఁ
దవిలి సత్పురుషకథా వినోదంబులు-
సలుపుచు నుండంగ సకలలోక
భయదంబు లగు మహోత్పాతముల్ దోఁచిన-
మసలి "లోకంబు లమంగళములు [4-431]

తే. వొరయ కుండెడుఁ గా కని బుద్ధిలోనఁ
దలఁచుచుండఁగఁ బెలుచ నుదగ్ర మగుచు
సర్వ దిశలను బాంసువర్షంబు గురిసెఁ;
దస్కరులు సర్వజనుల విత్తములు గొనిరి. [4-431.1]

వాళ్ళు అలా వెళ్ళి స్నానాలు కానిచ్చేలోపులే ఉత్పాతాలు కనిపించాయి. లోకంలో అమంగళం జరగకుండుగాక అనుకుంటూ ఉండగానే అన్ని దిశల్లోంచి ధూళి (పాంసు) వర్షం కురవడం మొదలైంది. అంతలోనే దొంగలు దోచుకొవడం మొదలుపెట్టారు జనాలని.

వ. ఇట్టి లోకోపద్రవం బెఱింగి జననాథుం డుపరతుం డగుటం జేసి జనపదంబు లరాజకంబులై యన్యోన్యహింసల నొందుచుం దస్కరబాధితంబు లగుచు నుండుట యెఱింగియుఁ దన్నివారణంబునకు సమర్థు లయ్యును జోరాది బాధలం గనుంగొనుచు మునులు వారింపక యుండిరి; మఱియు సమదర్శనుండు శాంతుండు మననశీలుండు నగు బ్రాహ్మణుండు దీనుల నుపేక్షించిన నతని తపంబు భిన్నభాండగతం బయిన క్షీరంబు చందంబున క్షయించుం; గావున నంగ వసుధాధీశ వంశోద్భవులు హరిపదాశ్రయు లగుటం జేసియు నమోఘ సత్త్వనిష్ఠులగుటం జేసియు వీరల వంశంబు విచ్ఛిత్తి నొందింప ననర్హంబు; గాన స్థాపనీయం బగు నని నిశ్చయించి మృతుండైన వేనుని కళేబరంబు దగ్గఱ వచ్చి తదూరు మథనంబు గావింప; నందు. [4-432]

రాజు పోయాడు కదా, అందువల్ల రాజ్యంలో ఎవరిష్టం వారిది. కానీ అరాజకం ఎక్కువయ్యే కొద్దీ “అంగరాజ్యంలో రాజులందరూ భగవంతుడైన హరి భక్తులు, సత్యనిష్టులూ కదా, వీళ్ల వంశం ఇలా నాశనం అవడం మంచిది కాదు. ఏదో ఒకటి చేసి వీళ్ల వంశాన్ని నిలబెట్టాలి” అని నిశ్చయించుకున్నారు. వేనుడి శరీరం రాజమాత దాచింది కదా పాడవకుండా? అందువల్ల ఆ శరీరం బయటకి తీసి తొడలమీద (ఊరు మథనంబు) మర్ధించారుట.

సీ. ఘన కాక కృష్ణ సంకాశ వర్ణుండును-
హ్రస్వావయవుఁడు మహాహనుండు
హ్రస్వబాహుండును హ్రస్వపాదుండును-
నిమ్న నాసాగ్రుండు నెఱయ రక్త
నయనుండుఁ దామ్రవర్ణశ్మశ్రుకేశుండు-
నతి దీన వదనుండు నైన యట్టి
యొక్క నిషాదకుం డుదయించి యేమి చే-
యుదు నని పలుకుచునున్నఁ జూచి [4-433]

తే. వరమునులు నిషీద యనుచుఁ బలుకుటయును
దాన వాఁడు నిషాదాభిదానుఁ డయ్యె;
నతని వంశ్యులు గిరికాననాళి వేను
కల్మషముఁ దెల్పుచుండిరి కడఁక మఱియు. [4-433.1]

ఒక కాకిలాగా నల్లగా ఉన్న బోయవాడు పుట్టాడు ఉన్నాడు. ఆయన మరుగుజ్జు. వస్తూనే దీనమైన ముఖంతో "నేను చేయవలసిన పని ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు ఈ మునులు "నిషీద (కూర్చుండు)" అన్నారు. అందుచేత ఆయన పేరు నిషాదుడు అయింది. అతని కులంలో పుట్టినవాళ్ళంతా నిషాదులై పర్వతాలలో అడవులలో సంచరిస్తూ వేనుని దుష్కీర్తిని వెల్లడిస్తున్నారు. అంటే పుట్టినవాడు రాజ్యానికి పనికిరాకుండా పోయాడు.

క. కని వార నపత్యం డగు
మనుజేంద్రుని బాహులంత మథియించిన నం
దనఘం బగు నొక మిథునము
జనియించెను సకల జనులు సమ్మద మందన్. [4-434]

మరోసారి ఈ మునులు వేనుడి హస్తాలను మథించేసరికి ఆ చేతులనుండి ఒక స్త్రీ, పురుషుల జంట జన్మించింది. అది చూచి సమస్త ప్రజలూ సంతోషించారు. పెద్ద పెద్ద చెవులూ, మంచి యశస్సూ ఉన్న ఆ పురుషుడుకి పృధువు అనీ ఆ పుట్టినావిడకి అర్చి అనీ పేరు పెట్టారు. వీళ్ళు లోక రక్షణార్ధంగా నారాయణాంశంతో పుట్టారని అనుకున్నారు.

కవి. అరయఁగ వైన్యుని దక్షిణహస్తము నందు రమారమణీసుమనో
హరులలితాయుధచిహ్నము లంఘ్రుల యందు సమగ్రహలాంకుశభా
స్వర కులిశధ్వజ చాప సరోరుహ శంఖ విరాజిత రేఖలు వి
స్ఫురగతి నొప్పఁ బితామహముఖ్యులు చూచి సవిస్మయులైరి తగన్. [4-438]

ఇలా పుట్టిన పృధువు చేతిలో శంఖ, చక్ర ఆయుధాల చిహ్నాలు, పాదాలలో హలం అంకుశం లాంటి రేఖలూ ఉండడం చూసి నిశ్చేష్టులయ్యారు. అసలే వేనుడి శరీరంలోంచి పుట్టాడు కదా, మరీ ఇంత తక్కువ వ్యవధిలో అలా పురాణపురుషుడు పుడతాడని ఊహించడం కష్టం. కృష్ణుడికి, బుద్ధుడికీ కూడా ఇటువంటి లక్షణాలు ఉండేవిట. వీటినే

ముప్పై రెండు మహాపురుష లక్షణాలనీ (అజాను బాహువులు వగైరా), ఎనభైకి పైబడి ఉన్న అనువ్యంజనాలనీ అనడం రామాయణం, భాగవతంలో చూడవచ్చు.

పై పద్యం ఏ వృత్తమో గమనించారా? 'కవిరాజ విరాజితం.' పోతన ఇటువంటివి మొత్తం భాగవతంలో పది కన్నా తక్కువలో రాసాడు అంటారు. వీలుండి, కుతూహలం ఉన్నవారు ఈ వృత్తం ఛందస్సు గురించి వికీపీడియాలో చూడవచ్చు. పుట్టినవాడు ఇటువంటి మహాపురుష లక్షణాలతో పుట్టాడు కనక పోతన ఈ వృత్తం సందర్భానికి సరిపోయేలా ఎంచుకున్నాడనిపిస్తుంది మనకి.

వ. ఇతండు నారాయణాంశ సంభూతుండు నితని యంగన రమాంశ సంభూతయుం గానోపుదు; రని తలంచి
యయ్యవసరంబున బ్రహ్మవాదు లగు బ్రాహ్మణోత్తము లతనికి విధ్యుక్తప్రకారంబున రాజ్యాభిషేకంబు గావించిరి;
తదనంతరంబ. [4-439]

ఈ పృథు చక్రవర్తి చిహ్నాలు చూసి ఈయన నారాయణాంశ సంభూతుడు, ఈ అర్చి అనే ఆవిడ లక్ష్మీదేవి అవతారం కావచ్చు అనుకుని ఈయనకి రాజ్యాభిషేకం చేసారు. వామనావతారంలో చూసాం ముందొకసారి. వామనుడు పుట్టగానే ఎవరెవరు. ఏయే దేవతలు వచ్చి ఆయనకి ఏమేమి ఇచ్చారో. అదే జరుగుతోంది ఇక్కడ కూడా.

సీ. రాజరాజా పృథురాజుకు హేమమ
యంబైన వీరవరాసనంబు
జలపతి జలకణ స్రావకం బగు పూర్ణ
చంద్ర సన్నిభ సితచ్ఛత్రము మఱి
పవమానుఁ డమలశోభన మగు వాలవ్య
జన సమంచిత సితచామరములు
ధర్ముండు నిర్మలోద్యత్కీర్తిమయ మగు–
మహనీయ నవ పుష్ప మాలికయును [4—442]

తే. జంభవైరి కిరీటంబు శమనుఁ డఖిల
జన నియామక దండంబు జలజభవుఁడు
నిగమమయ కవచంబు వాణీలలామ
స్వచ్ఛ మగు నవ్యహార మొసఁగిరి మఱియు. [4--442-1]

కుబేరుడు బంగారు సింహాసనం, వరుణుడు నీళ్ళతో అస్రావకంబు (చెమర్చనిది/తడవనిది) అయిన గొడుగు, అలా తలొకటి ఇస్తే ఇంద్రుడు కిరీటం, యముడు ఒక దండం (నియామకం చేసేది), బ్రహ్మదేవుడు ఒక కవచం, సరస్వతి ఒక ముత్యాలహారం ఇచ్చారు. ఈ పద్యంలో కుబేరుడు, ఇంద్రుడు, యముడు, బ్రహ్మదేవుడు అనేవి ఎక్కడున్నాయో చెప్పండి చూద్దాం? రాజరాజా – వైభవములకు అధిపతి –కుబేరుడు. జంభవైరి – జంభాసురుడనే రాక్షసుణ్ణి చంపినవాడు, ఇంద్రుడు. శమనుడు – శమన – చీకటిలోకలకి అధిపతి – యముడు. జలజభవుడు – పద్మంలో పుట్టినవాడు – ఇంకెవరు బ్రహ్మ.

అయితే పుట్టినవాడు పూర్ణావతారం కాదు. విష్ణువు అంశతో పుట్టాడు. అందువల్ల ఇంకా మిగతా దేవతలు ఏమి ఇచ్చారో చెప్తున్నాడిప్పుడు – విష్ణువుతో సహా.

సీ. దామోదరుండు సుదర్శన చక్రంబు
నవ్యాహతైశ్వర్య మబ్జపాణి
చంద్రార్ధధరుఁ డర్ధచంద్ర రేఖాంకిత-
కమనీయ కోశసంకలిత ఖడ్గ
మంబిక శతచంద్ర మను ఫలకముఁ జంద్రు-
డుయమృతమయ శ్వేతహయచయంబుఁ
ద్వష్ట రూపాశ్ర యోదాత్త రథంబును-
భానుండు ఘృణిమయ బాణములును [4-443]

తే. శిఖియు నజగోవిషాణ సంచిత మహాజ
గవ మనందగు చాపంబు నవనిదేవి
యోగమయమైన పాదుకాయుగము గగన
చరులు గీతంబు లిచ్చిరి సంతసమున. [4-443-1]

మహావిష్ణువు (దామోదరుడు; దామము – పద్మము; ఉదరంలో ఉన్నవాడు) సుదర్శన చక్రం, శివుడు (చంద్రార్ధ ధరుడు – అర్ధ చంద్రుణ్ణి తలలో ధరించినవాడు) ఖడ్గం, సూర్యుడు (భానుండు) బాణాలని చంద్రుడు తెల్లని గుర్రాలని ఇస్తే త్వష్ట – విశ్వకర్మ ఒక రథాన్ని ఇచ్చారు.

వ. వెండియుం; బ్రతిదివసంబు నాకాశంబు పుష్పంబులు గురియింప మహర్షులు సత్యంబులైన యాశీర్వచనంబులు సలుప సముద్రుండు శంఖంబును, నదంబులు పర్వతంబులు నదులును రథమార్గంబు నొసంగెఁ; దదనంతరంబ సూత మాగధ వంది జనంబులు దన్ను నుతియించినం బ్రతాపశాలి యగు నవ్వైన్యుండు మందస్మిత సుందర వదనారవిందుండై చతుర వచనుం డగుచు మేఘగంభీర భాషణంబుల వారల కిట్లనియె. [4-444]

చిన్న సందేహం. వేనుడివంటి దుర్మార్గుడి శరీరంలోంచి మహావిష్ణువు అవతారం రావడం ఏమిటి? సమాధానం కోసం పోతన భాగవతం మొదలుపెడుతూ చెప్పిన పద్యం ఓ సారి చూద్దాం. భగవంతుడు ఎటువంటివాడు? "..... లోక రక్షైకారంభకు, భక్తపాలన కళాసంరంభకున్, దానవోద్రేక స్థంభకు..." అన్నాడు కదా. వేనుడు ఎటువంటి దుర్మార్గుడైనా భగవంతుడి మొదటి లక్ష్యం ఏమిటంటే లోకాలని రక్షించడం. మొత్తం లోకం అంతా అరాజకం అవకూడదనే అలా భగవదంశతో పృథు చక్రవర్తి పుట్టాడని చెప్పుకోవచ్చు. మళ్ళీ కథలోకి వస్తే, వేనుడి వల్ల రాజ్యం పాడైంది. దొంగలు దోచేస్తున్నారు. కొత్తగా వచ్చిన రాజు అన్నీ ఒక్కరోజులో సరిద్దిద్దలేడు కదా. ముందు వర్షాలు కురవాలి, పంటలు పండాలి, అలా ఒక్కొక్కటీ కష్టాలు తీరితే గానీ ఏమీ పూర్తవదు. ఇలా పుట్టిన పృథు చక్రవర్తికి అన్నీ అమరాక రాజ్యం గురించి ఆలోచిస్తూ ఏం చేస్తాడో వచ్చే వ్యాసం నుంచీ చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS